ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్


జిల్లా వార్తలు

5

బుధవారం 11 డిసెంబరు 2024

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

భగత్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్షుడు డి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) జిల్లా సమా వేశం అంబేద్కర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లాఅధ్యక్షుడు రత్నం రమేష్, నాయకులు పాల్గొన్నారు.



'రియల్' సంక్షోభం

భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

- బోసిపోతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- ప్రత్యామ్నాయ మార్గంలో రియల్టర్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

భూములు, ఇళ్లు, ఇళ్లస్థలాల క్రయ, విక్రయాలు పూర్తిగా తగ్గడంతో రియల్ వ్యాపారం సంక్షోభంలో పడింది. ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవించే రియల్టర్లు, కమీషన్‌దారులు ప్రత్యామ్నాయ ఉపాధిమార్గాలను ఎంచుకుంటు న్నారు. బిల్డర్లు, రియల్‌వ్యాపారులు, గతంలో భూములపై పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లు క్రిప్టోకరెన్సీ, బిట్ కాయిన్ ఆన్‌లైన్ బిజినెస్‌లలో భారీగా పెట్టుబడులు పెట్టడం, వ్యవసాయ, వ్యవసాయేతర నివాస, వాణిజ్య భూముల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందకుండా పోవడం కారణంగా రియల్ జోరు పూర్తిగా తగ్గిపోయింది. దీనితో రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన అనేక మంది వ్యాపారాలు లేక ఆర్థిక ఒడుదుడుకులను ఎదుర్కొంటున్నారు. క్రయవిక్రయదారులు, డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులతో నిత్యం కిటకిటలాడే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు బోసిపోతున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈయేడాది జిల్లాలో 40శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు తగ్గడంతో రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పడిపోయింది. కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్ (తిమ్మాపూర్), హుజురాబాద్, గంగాధరలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలు ఉండగా ఒక్క కరీంనగర్ అర్బన్ కార్యా లయంలోనే గతంలో రోజుకు 100 నుంచి 120 వరకు రిజి స్ట్రేషన్లు అయ్యేవి. ప్రస్తుతం రోజుకు 40కి మించడం లేదని, అందులో దాదాపు 30 డాక్యు మెంట్లు మార్ట్‌గేజ్ చేయడం, మార్ట్‌గేజ్ రిలీజ్ డాక్యుమెంట్లు కాగా, కేవలం 10 నుండి 15 కూడా రిజిస్ట్రేషన్లు కావడం లేదు. మిగిలిన మూడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కూడా ఇదే పరిస్థితి నడుస్తోంది.

2023, 2024 సంవత్సరాలలో కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, కరీంనగర్ రూరల్, హుజురాబాద్, గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో 10 నెలల కాలంలో అయిన రిజిస్ట్రేషన్ల సంఖ్య

సం.	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు	మొత్తం
2023	2,668	3115	3183	2701	2898	2626	3071	3126	2443	2577	28,408
2024	2367	2655	2942	2163	2412	2493	2852	2896	2690	2698	26,168

తగ్గిన భూక్రయవిక్రయాలు

జిల్లాలో భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రయ విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. గత యేడాదితో పోల్చితే రిజిస్ట్రేషన్‌ల ద్వారా వచ్చే ఆదాయం 40శాతంకుపైగా తగ్గిపోయింది. 2024 సంవత్సరంలో నెల వారీగా రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గుతూ వచ్చాయి. 2023(జనవరి నుంచి అక్టోబరు వరకు)లో 60.40 కోట్ల ఆదాయం సమకూరగా, 2024(జనవరి నుంచి అక్టోబరు వరకు) 38.81 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. అయితే రిజిస్ట్రేషన్‌ల సంఖ్యను పరిశీలిస్తే కొద్దిపాటిగా తగ్గుముఖం కనపడుతున్నది. దీనికి కారణం ఇళ్లు, ఇళ్ల స్థలాలపై బ్యాంకు, ఫైనాన్స్ సంస్థల్లో మార్టిగేజ్‌లు చేసుకోవడంతో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య కొంత మేరకే తగ్గింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రియల్ భూమ్ రాష్ట్ర వ్యాప్తంగా పడిపోయింది. క్రయ విక్రయాలు ఘణనీయంగా తగ్గిపోయాయి. దీనికి ప్రధాన కారణం ఇప్పటికే భూముల ధర లు పతాక స్థాయిలోకి వెళ్లడం ఒక కారణంగా చెప్పుతున్నారు. దీంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టడం కారణంగా భావిస్తున్నారు. మరో వైపు హైడ్రా జిల్లాలో కూడా అమలు చేస్తారని ప్రచారం జరగడం కూడా రియల్ ఎస్టేట్ రంగంలో లావాదేవీలు తగ్గిపోయాయని చెబుతున్నారు. కరీంనగర్ జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఘణనీయంగా తగ్గిపోయింది. పలువురు వ్యాపారులు వారు కొనుగోలు చేసిన ఇళ్ళ స్థలాలు, భూములు, ప్లాట్స్ అమ్మేందుకు నానా తంటాలు పడుతున్నారు. విక్రయించే వారు ఉన్నప్పటికీ కొనుగోలు దారులు ముందుకు రాకపోవడంతో రియల్ వ్యాపారం మరింత తగ్గుముఖం పట్టింది. కొంత మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అప్పులు తీసుకుని కొన్ని స్థలాలు, ఇళ్లను కొనుగోలు చేయగా ఆ స్థలాలను విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనుగోలుదారులు లేకపోవటంతో అప్పులభారం ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు మాత్రం తక్కువ ధరకైనా విక్రయించేందుకు సిద్ధమయ్యారు. పలు రంగాలకు చెందిన వ్యాపారులతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్ల రూపాయలు ఈ క్రిప్టో కరెన్సీ ఆన్‌లైన్ చైన్ సిస్టంలో పెట్టుబడులు పెడుతుండటం కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దెబ్బగా మారిందని పరిశీలకులు చెబుతున్నారు.

2023, 2024 లోరిజిస్ట్రేషన్ల ఆదాయం

	2023(కోట్లలో)	2024(కోట్లలో)
జనవరి	6.190	3.783
ఫిబ్రవరి	7.045	3.837
మార్చి	6.072	3.912
ఏప్రిల్	6.865	3.252
మే	6.386	3.645
జూన్	5.185	3.527
జూలై	5.377	3.889
ఆగస్టు	7.150	4.194
సెప్టెంబరు	5.482	5.547
అక్టోబరు	4.655	3.233
మొత్తం	**60.40**	**38.81**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
ప్రపంచ వేదికపై ప్రసంగించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రపంచ వేదికపై తమ ఉపన్యా సాలను ఇవ్వాలని, ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు. మంగళవారం పద్మనగర్‌లోని పారమిత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, పారమిత విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను టెడ్-ఎడ్ స్టూడెంట్స్ టాక్స్ కార్యక్రమానికి పంపేందుకు జిల్లాస్థాయి ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 176 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 345 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా 40 మంది ఎంపికయ్యారు. వారి నుంచి ఇద్దరిని ఎంపిక చేసి ప్రపంచస్థాయి టెడ్‌ఎడ్ ఉపన్యాసానికి పంపించనున్నారు. ఎంపికకు హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఈ శిక్షణ ప్రభుత్వ విద్యార్థులకు భవిష్యత్తులో మంచి మార్గం చూపుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగ సాధనకు భావవ్యక్తీకరణ చాలా ముఖ్యమని అన్నారు. టెడ్ వేదికపై కరీంనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సత్తాచాటి జిల్లాలోని 57 వేల మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. తద్వారా భవిష్యత్తులో జరగనున్న పోటీలకు మరింత మంది ముందుకు వస్తారని సూచించారు. గత ఆరు సంవత్సరాలుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ఆపేసిన విద్యార్థులందరికీ పరీక్ష రాయించానని తెలిపారు. అందులో 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యనభ్యసిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉపన్యాసాలను విని వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు, గంగాధర మండల విద్యాధికారి ప్రభాకర్‌రావు, క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో
సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ

హుజూరాబాద్/ హుజూరాబాద్ రూరల్/ జమ్మికుంట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను వైద్య సిబ్బంది ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ డివిజన్‌లోని చెల్పూర్, వావిలాల, ఇల్లందకుంట, జమ్మికుంట పీహెచ్‌సీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఆస్పత్రిలో రోగులకు బీపీ, ఎంసీడీ, బెస్ట్ క్యాన్సర్, ఓవర్ క్యాన్సర్, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం తప్పని సరిగా నిర్వహించి, మహిళలకు పరీక్షలు చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని పేద ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వైద్య సిబ్బంది పంజాల ప్రతాప్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ మండలం చెల్పూర్ పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

వరి కొయ్యలను
నేలలో కలియదున్నాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి

శంకరపట్నం/సైదాపూర్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వరి కొయ్యల అవశేషాలను కాల్చకుండా నేలలో కలియ దున్నడం వల్ల నేల సారవంతంగా మారడంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం శంకరపట్నం మండలంలోని కరీంపేట, సైదాపూర్ మండల కేంద్రంలో వరి కొయ్యల అవశేషాలను కాల్చడం వలన జరిగే అన ర్థాలపై రైతులకు వివరించారు. ఎకరానికి 50కిలోల ఎస్ఎస్‌పీ, 15కేజీల యూరియా వరి కొయ్యల అవశేషా లపై జల్లి నీరు పెట్టడం వల్ల వేగంగా డీకంపోజ్ అవుతుందన్నారు. తర్వాత రోటవేటర్‌తో కలియదున్నడం వల్ల 20-30రోజుల్లో కొయ్యలు అవశేషాలు పూర్తిగా కుళ్లి పోయి పోషకాలు విడుదల అవుతాయన్నారు. ఈ కార్య క్రమంలోసైదాపూర్ ఏవో వైదేహి, ఏఈవోలు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- కలెక్టరేట్ ఎదుట సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

సుభాష్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం నుంచి కలెక్టరేట్ ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబరు 13న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు హనుమకొండలోని ఏకశిల పార్కువద్ద చేపట్టిన దీక్ష శిబిరాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీపీసీసీ హోదాలో సందర్శించారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలన్నారు.



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేపట్టిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పలువురు నాయకులు మద్దతు

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, ప్రధానకార్యదర్శి ఎడ్ల రమేష్, ట్రెజరర్ రాజేశం, బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మన్, టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బాలయ్య, డీటీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి, బీజేపీ సీనియర్ నాయకుడు సుగుణాకర్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండ రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రగిరి మహేశ్, బి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, నీరజ, రవిచందర్ పాల్గొన్నారు.

మాఫీ అయ్యేనా?

- రూ.2లక్షలకు పైన రుణం ఉన్న రైతుల్లో ఆందోళన
- రుణమాఫీ కోసం ఎదురు చూపులు

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు రూ. 2లక్షల రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండు లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు, వారి కుటుంబ సభ్యుల మొత్తం రెండు లక్షలకు పైన రుణం ఉంటే మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మాఫీ కాని వాళ్లలో చాలా మంది సన్న, చిన్నకారు రైతులు ఉన్నారు. గ్రామాల్లో కొందరు రైతులకు మాఫీ అయి కొందరికి కాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తామని కొంత మేర చేయడంతో ఆ ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడి కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఏడాది పూర్తవుతున్నా దశలవారీగా రుణమాఫీ చేసుకుంటూ వస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 2లక్షల రుణం ఉన్న రైతులకు రుణమాఫీ ప్రకటించారు. సాగుకోసం, కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకోసం రైతులు అప్పులు తీసుకున్నారు. ఒకే కుటుంబంలో వేరు వేరు వ్యక్తులు రెండు లక్షలపైన రుణం తీసుకున్నారు. ఇలాంటి వారికి రుణమాఫీ కాలేదు. 2లక్షలకు పైగా రుణం ఉన్నవారు మిగతా డబ్బులు బ్యాంకులకు చెల్లిస్తే రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. గ్రామాల్లో కొంత మంది రైతులకు రుణమాఫీ అయి, మిగితా వారికి కాకపోవడంతో తీవ్ర నిరాశతో ఉన్నారు. హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం ఆరు మండలాల్లో సుమారు 8వేల మంది రైతులు రూ.2లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారిలో ఉన్నట్లు వ్యవ సాయశాఖ అధికారులు చెబుతున్నారు. రెండు లక్షలలోపు ఉన్న చాలా మందికి కూడా రుణమాఫీ కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం రుణమాఫీ కానీ రైతులు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు, నిరసన చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేయాలని రైతు సంఘాల నాయకుడు పొలాడి రామారావు కోరుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ కాని రైతులను గుర్తించి, వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.



నా కుటుంబానికి రుణమాఫీ కాలేదు



- గూడూరి మల్లారెడ్డి, రైతు, ఇప్పల్ నర్సింగాపూర్

వ్యవసాయ అవసరాల కోసం బ్యాంకులో రూ. 2.10లక్షల అప్పు తీసుకున్నాను. ఒకే కుటుంబంలో రూ. 2లక్షల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తానని ప్రకటించింది. అందులో నాకు అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదు. రెండు లక్షలకు పైన ఉన్న డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రభుత్వం రెండు లక్షలకు పైగా ఉన్న రుణాలను మాఫీ చేయాలి.

రూ. 2లక్షలకు పైగా ఉన్న వారికి మాఫీ చేయాలి



- ముచ్చ సమ్మిరెడ్డి, రైతు సంఘం నాయకుడు, దమ్మక్కపేట

రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదు. తన కుటుంబ సభ్యు ల పేరు మీద ఉన్న భూమితో బ్యాంకులో రూ. 2.30లక్షల రుణం తీసుకున్నాను. పైన ఉన్న రూ. 30వేలను చెల్లిస్తా. మిగితా రెండు లక్షల అప్పును ప్రభుత్వం మాఫీ చేయాలి. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

క్రైం కార్నర్

దివ్యాంగురాలైన కూతురుని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన కన్న కూతురుని హత్య చేసిన నేరంలో నిందితుడైన కసాయి తండ్రికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి ప్రతిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మానకొండూరు మండలం తీగల గుట్టపల్లికి చెందిన కొమిరె మహేందర్ (38)కి పెళ్లి కాగా కొన్నాళ్లకు ఆమె చనిపోవటంతో చంద్రపురి కాలనీకి చెందిన భావనను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి పాప జన్మించింది. పాప జన్మించిన ఆరు నెలల సమయంలో ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో నరాలు దెబ్బతిని కాళ్లు చేతులు పడిపోయాయి. ఆమెకు ఆరు సంవత్సరాల వయస్సు వచ్చినా అలాగే ఉంటున్నది. ఏపని చేయక తాగుడుకు అలవాటు పడిన కొమిరె మహేందర్ బిడ్డపై వ్యతిరేకత పెంచుకొని భార్యాబిడ్డలను తరచూ వేధిస్తుండేవాడు. అతని వేధింపులు భరించలేక భావన బిడ్డను ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయింది. ఇదే అదనుగా భావించిన మహేందర్ 2023 మార్చి1న రాత్రి దివ్యాంగురాలైన బిడ్డను హత్య చేసి కెనాల్‌లో పడేశాడు. ఈ సంఘటనపై భావన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మహేందర్‌పై కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ విజ్ఞాన్‌రావు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను ఎస్ఐ తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి వెంకటేశ్వర్లు విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి ప్రతిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 1000 రూపాయల జరిమానా విధించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాల్లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు మరొకరికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల జిల్లా కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన చెదలు రాజేందర్‌ను 2022 జనవరి 13న అదే గ్రామానికి చెందిన కాస సంజీవ్, గోధుర్ గ్రామానికి చెందిన తైదపల్లి రజనీకాంత్ వ్యవసాయ పొలంలో దారి విషయంలో గొడవకు దిగి రాజేందర్‌ను కత్తులతో పొడిచి హత్య చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసిన కాస సంజీవ్ ఏ1, తైదపల్లి రజనీకాంత్ ఏ2, వీరికి సహకరించిన రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన మంగళరపు లక్ష్మీనారాయ ణను ఏ3గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసుకు సంబంధించిన సరైన సాక్ష్యాలను పోలీసులు కోర్టులో ప్రవేశ పెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా అదనపు జడ్జి మంగ ళవారం తీర్పు వెల్లడించారు. నిందితులు కాస సంజీవ్, రజనీకాంత్ కు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి 10 వేల జరిమానా విధించినట్లు తె లిపారు. ఏ3 లక్ష్మీనారాయణకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా అదనపు జడ్జి తీర్పు వెల్లడించారు.

బాలికపై అత్యాచారం
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కోరుట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఓ యువకుడిపై పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని అలమయ్య గుట్టు ప్రాంతానికి చెందిన బాలిక(14)తో పాటు ఆమె తల్లి నివాసం ఉంటున్నారు. సదరు బాలిక తల్లి పలు ఇళ్లలో పని మనిషిగా చేస్తోంది. కూతురు ఇంటి వద్దనే ఉండడంతో కాలనీకి చెందిన యువకుడు ఇప్ప రవి సదరు బాలికతో పరిచయం పెంచుకున్నాడు. కొద్ది రోజులగా బాలికను బెదిరింపులకు పాల్పడుతూ అత్యాచారానికి పాల్పడుతున్నాడు. మంగళవారం విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో ఇద్దరు కలిసి రవి ఇంటికి వెళ్లి నిలదీయడంతో వారిపై రవి దాడి చేసాడు. దీంతో సదరు మహిళ స్థానికుల సహాయంతో పోలీసు స్టేషన్‌కు చేరుకొని తన కూతురుపై జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. విషయంపై కోరుట్ల సీఐ సురేష్ బాబు ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం బాలికకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. ఈ విషయంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు కోరుట్ల పోలీసు స్టేషన్‌లో విచారణ జరిపినట్లు సమాచారం.

ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దు


దర్శన టికెట్లను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దని గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మంగళవారం దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆలయాన్ని సందర్శించి దేవాదాయ శాఖలోకి విలీనం చేసుకుని ఈవో కాంతారెడ్డికి బాధ్యతలను అప్పగించారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్థు లు అక్కడకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆలయ పరిస రాల్లో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎళ్ల నుంచి ఆలయానికి సేవలు చేస్తూ ఆధారిపడిన వారి కుటుంబాలు రోడ్డున పడతాయని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విలీనం ఆపాలని కోరారు. నిర్వాహకులకు దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ వారికి తెలిపారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని వ్యాపారస్థులతో మాట్లాడి టికెట్ చార్జీలను తెలుసుకున్నారు. ఆలయానికి లక్షల్లో ఆదాయం వచ్చినా భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదని రెండేళ్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో దేవాదాయశాఖ అధికారులు విచారణ చేపట్టి ఆలయాన్ని విలీనం చేసిందన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ఆలయం వద్ద బందోస్తు ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని ఆమె కోరారు. దేవాదాయశాఖ అధికారులు, పోలీసుసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

శంకరపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలోని నేదురు ఐలమ్మ ఇంటి తాళం పగలగొట్టి రూ. 74వేల నగదు, బంగారు గొలుసులు చోరికి గురైన సంఘటన వెలుగు చూసింది. నేదురు ఐలమ్మ సోమవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి గర్రెపల్లికు వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోనే వస్తువులు చిందరవందర పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లిచూడగా రెండు తులాల బంగారు గొలుసులు, రూ. 74వేల నగదు దొంగలించినట్లు తెలిపారు. గ్రామంలోని ఓ కుటుంబం ఇంటి తాళం పగలగొట్టి చోరికి పాల్పడ్డారని కేశవపట్నం పోలీసులకు బాధితురాలు ఐలమ్మ ఫిర్యాదు చేసింది.

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని కొత్తపల్లి రాజేశ్వరి తన ఇంటికి తాళం వేసి కథలాపూర్ మండలంలోని పోసానిపేట గ్రామానికి వెళ్లింది. మంగళవారం ఉదయంలో ఇంటికి తిరగి వచ్చిన రాజేశ్వరి తన ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గుర్తించింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అదే ప్రాంతంలో ఉన్న సల్ల లక్ష్మణ్ ఇంటి తలుపులకు ఉన్న తాళం పగుల గొట్టి ఉండగా గమనించిన స్థానికులు లక్ష్మణ్‌కు సమాచారం అందించారు. లక్ష్మణ్ మూడునెలల నుంచి మెట్‌పల్లి పట్టణంలోని ఉంటున్నాడు. కొత్తపల్లి రాజేశ్వరి ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు ఐదువేల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మణ్ ఇంట్లో ఎంతపోయిందో రాత్రి వరకు నిర్ధారణ కాలేదు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ ద్వారా వేలిముద్రలను నమోదు చేసి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాక్ ఇలా.. టెస్ట్ ఎలా..?


డ్రైవింగ్ టెస్టు ట్రాక్ కనిపించకుండా ఇరువైపుల పెరిగిన చెట్లు

- అసంపూర్తిగా డ్రైవింగ్ టెస్టు ట్రాక్
- 2015 ప్రారంభమైనా పూర్తికాని పనులు
- ట్రాక్ లేక నామమాత్రంగా డ్రైవింగ్ పరీక్షలు

తిమ్మాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీ కార్యాలయంతో పాటు జిల్లా రవాణా శాఖ కార్యాల యం ఉన్నది. ఇందులో 5 ఎకరాల విస్తీర్ణంలో 2015వ సంవత్సరంలో డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రారం భించారు. కొంత పనులు పూర్తయిన్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ట్రాక్‌కు ఇరువైపులా పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయింది.


ముళ్లతో చిత్తడిగా ఉన్న ట్రాక్

డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు

డ్రైవింగ్ టెస్టులో ఉత్తీర్ణత కావాలంటే ముందుగా వాహనం నడిపే వ్యక్తికి రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి. రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఉంటాయి. అలాంటి సమయాల్లో ఏ విధంగా వాహనం నడపాలనేది ప్రతి వాహనదారుడు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఇందుకోసం డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. కారు, ద్విచక్ర, భారీ వాహనాలు నడిపే వారికి వేరువేరుగా ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. 8 ట్రాక్ బాగా మలుపులు ఉన్న రోడ్లపై ఎలా ముందు వెళతున్నామో తెలుస్తుంది. హెచ్‌ట్రాక్ ద్వారా వాహనం ముందుకు వెళ్లిన తరువాత రివర్స్ చేయాల్సి వచ్చినప్పుడు ఎలా తీసుకుంటున్నారో తెలుస్తుంది. ఎస్ ట్రాక్ ఒక మూల నుంచి మరో మూలకు మలుపు కోవాల్సి వచ్చినప్పుడు ట్రాక్ ద్వారా వాహనం నడిపే వారి నైపుణ్యం తెలిసిపోతుంది. ఎత్తుపల్లాల ట్రాక్ ద్వారా లోయలు, ఎత్తు పల్లాలు వంటి ప్రాంతాల్లో వాహనం ఎలా నడుపుతారో పరిశీలిస్తారు.

అమలు కాని నిబంధనలు :

మోటారు వాహన చట్టం నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో నిర్ణీత ప్రమాణా ల మేరకు వాహనం నడిపితేనే డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే వారికి రవాణాశాఖ అధికారులు పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి లైసెన్స్ మంజూరు చేస్తారు. ప్రస్తుతం డ్రైవింగ్ టెస్టు ట్రాక్ అందుబాటు లోకి రాకపోవడంతో నామమాత్రంగానే కార్యాలయం సమీపంలోనే ఖాళీ స్థలంలో బండ రాళ్లను ఏర్పాటు చేసి డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం టెస్టులు నిర్వహించక పోవడంతో డ్రైవింగ్ సరిగా రాకున్నా లైసెన్స్ ఇవ్వాల్సి వస్తుందనే విమర్శ లు ఉన్నాయి. ట్రాక్ వద్ద చెట్ల పొదలతో చిత్తడిగా మారింది. అధికారులు స్పందించి ట్రాక్ చుట్టూ ఉన్న చెట్ల పొదలు తొలగించి డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు పూర్తి చేయాలని వాహన దారులు కోతున్నారు.


బండరాళ్లను ఏర్పాటు చేసి టెస్టు చేయిస్తున్న అధికారులు


ఎత్తు పల్లాల ట్రాక్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

డ్రైవింగ్ టెస్టులకు త్వరలో కొత్త టెక్నాలజీ
డీటీసీ పురుషోత్తం



ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం తెలిపింది. అప్పటి వరకు పాత పద్ధతిలోనే డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తాం. ఆటో మెటిక్ టెస్టింగ్ సెంటర్లు ఎప్పుడు వచ్చేది పూర్తిగా తెలియదు. డ్రైవింగ్ టెస్టు ట్రాక్ నిర్మాణం ఎందుకు అగిపోయిందో తెలియదు. ప్రస్తుతానికి సీనియర్ ఇన్స్‌పెక్టర్ల పర్యవేక్షణలో డ్రైవింగ్ టెస్టులు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు


తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ జిల్లా కేంద్రంలోని అకస్మిక తనిఖీలను నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలోని స్కానింగ్ మిషన్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ మాట్లాడారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనాల ప్రకారం గర్భస్థ పూర్వ పిండ స్కానింగ్ పరీక్షలను నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు రుజువైతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం స్కానింగ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఎన్జీవో చింతోజు భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాష్ శుక్ల పాల్గొన్నారు.

పోలీసుల వాహన తనిఖీలు.. తప్పించుకునే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వాహన తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి తన బైక్‌పై అతి వేగంగా వెళతూ మరో వాహనాన్ని ఢీకొట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంలో మండల కేంద్రంలోని వ్యక్తి చరణ్‌తో పాటు మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో చరణ్ పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన చరణ్ తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్నాడు. వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి భయంతో బైక్‌ను వెనక్కి తిప్పి అతి వేగంగా ముందుకు దూసుకెళ్లి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో చరణ్‌తో పాటు మరో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. చరణ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో రోడ్డు పక్క నుంచి ఒక్కసారిగా రోడ్డుపైకి రావడం వల్ల తప్పించుకునే ప్రయత్నంలోనే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు.

జాతీయ బయోకెమిస్ట్రి సదస్సులో సిమ్స్ విద్యార్థుల ప్రతిభ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) విద్యార్థుల పరిశోధన, నైపుణ్యంతో జాతీయ బయోకెమిస్ట్రి సదస్సులో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 4 నుంచి 7వరకు చండీఘర్‌లో జరిగే 50వ జాతీయ బయో కెమిస్ట్రి సదస్సు ఏసీబీ ఐకాన్-2024 నుంచి గోదావరిఖని సింగరేణి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు చెందిన ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. సాధారణంగా ఎండీ, పీహెచ్‌డీ స్థాయి విద్యార్థులు చేసే పరిశోధన ప్రదర్శనకు దీటుగా సిమ్స్ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు ప్రదర్శన చేయడంపై ఐఎఫ్‌సీసీ అధ్యక్షుడు, ఏసీబీ ఐకాన్-2024 అధ్యక్షుడు డాక్టర్ ఇందు వర్మ ప్రత్యేకంగా అభినందించారు. బయోకెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌వర్ధన్ సారధ్యం లో పరిశోధన చేశారు. ఈ పరిశోధను జాతీయ సదస్సులో ప్రదర్శించారు. సాత్విక్, తిరూశి, అభిరామ్ రెడ్ టాక్సిసిటీ నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలపై బయోకెమిస్ట్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోకవర్ధన్ సహకారంతో పరిశోధన ప్రదర్శన నిర్వహించారు. సృజన, హర్షవర్ధన్, సందీప్ విటమిన్-డీ, శ్వాసకోశ సం బంధిత సమస్యలు, దాని ప్రభావం అంశంపై ప్రదర్శన నిర్వహించారు. అలాగే సాల్వాజీ రిషిరావు, గోషిక అన్షు న్యూరో బయో కెమిస్ట్రిలో మెదడు, జ్ఞాపకశక్తి అంశంపై ప్రదర్శన నిర్వహించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, వైస్‌ప్రిన్సిపాల్, బయోకెమిస్ట్రి విభాగ అధిపతి డాక్టర్ నరేందర్ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు

మద్యం మత్తులో ఆర్టీసీ బస్‌పై దాడి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన ప్రయాణికుడు ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. మంగళవారం గోదావరిఖని బస్టాండ్‌లో ఓడేడు వెళ్తన్న టీఎస్02 యూపీ 9885 బస్సులో కరీంనగర్‌కు చెందిన పంపరి శివకుమార్ ఎక్కాడు. తోటి ప్రయాణికులతో గొడవకు దిగిన శివకుమార్ కాలనీ షిర్కే బస్‌స్టాప్ వద్ద నడుస్తున్న బస్ నుంచి దూకాడు. రాళ్లతో బస్ అద్దాలను ధ్వంసం చేశాడు. దాడి ఘటనపై డ్రైవర్ బొడ్డు కుమార్ గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

హ్యాండ్ బ్యాగ్ అప్పగింత

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) స్థానిక చందపల్లికి చెందిన గజరంగి పోశెట్టి తన భార్య పిల్లలతో బైక్‌పై ఈనెల 4న బందంపల్లికి వెళతుడగా హ్యాండ్ బ్యాగ్ పడిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగులో తులం చెవికమ్మలు, మాటీలు ఉన్నయని ఎస్సై లక్ష్మణ్‌రావుకు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై విచారిస్తుండగా శాంతినగర్ పెట్రోల్ బంక్ దగ్గర్లో పంక్చర్ షాప్ నడుపుకునే ఎండీ అఫ్జల్ తనకు హ్యాండ్ బ్యాగ్ దొరికిందని పోలీసులకు అప్పగించాడు. పెద్దపల్లి ఏసీపీ సమక్షంలో బ్యాగ్‌లో ఆభరణాలతో బాధితులకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న అఫ్జల్‌ను ఏసీపీ కృష్ణ మంగళవారం సన్మానించారు.

23క్వింటాళ్ల బియ్యం పట్టివేత

జమ్మికుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులోని బెండ బుడగజంగ కాలనిలో గల ఓ డేరాలో అక్రమంగా నిల్వ ఉంచిన 23.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని మార్కండేయ కాలనీకి చెందిన చింతల రామస్వామి అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీస్‌లు గుర్తించారు. ఈ మేరకు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

తండ్రి, కూతురు అరెస్టు

చందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటనలో తండ్రితోపాటు కూతురును అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జాగిరి నర్సయ్య తనకు చెందిన ఇల్లును అతనికి తెలియకుండానే తన అన్న అయినా జాగిరి పర్శరాములు, కూతురు జాగిరి మానస, నేరెళ్ల రమేష్ కలిసి మానస పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా జాగిరి పర్శరాములు, జాగిరి మానసలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించాగా, నేరెళ్ల రమేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణిలో మహిళా అధికారులు

- ఇప్పటి వరకు ఉద్యోగులుగానే పరిగణింపు
- ఇక నుంచి మైనింగ్‌లోనూ నియామకం
- మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)లుగా విధుల్లో చేరిక



నేటి ఆధునిక సమాజంలో మహిళ ఒక పైలట్‌గా, అంతరిక్ష వ్యోమగామిగా, డాక్టర్‌గా, పోలీసుగా, రాజకీయ నాయకురాలిగా ఇలా అన్ని రంగాల్లో రాణిస్తోంది. మహిళలు మగవారికి దీటుగా 'సరిలేరు స్త్రీకెవ్వరు' అన్నట్లుగా దూసుకెళుతున్నారు. అందుకే సింగరేణి సంస్థ పురుషులకే పరిమితమనుకున్న మైనింగ్ రంగంలో అవకాశం ఉన్న చోట మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది.

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నవశకం మొదలైంది. ఇప్పటి వరకు యాజమాన్యం మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పించగా ఇక నుంచి మహిళా అధికారులు(మేనేజ్‌మెంట్ ట్రైనీ-మైనింగ్) సంస్థలో పనిచే సేందుకు అంతా సిద్ధమైంది. శ్రీరాంపూర్ ఏరియాకు 22 మంది ఎంటీ(మైనింగ్) అధికారులను కేటాయించగా, ఇందులో ముగ్గురు మహిళా అధికారులు ఉన్నారు. వారు సోమవారం విధుల్లో చేరారు.


మేనేజ్‌మెంట్ ట్రైనీ మైనింగ్ మహిళా అధికారులు

బ్రిటీష్ నాటి కాలంలో..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సింగరేణి గ్రామంలో (ప్రస్తుతం ఇల్లెందు) 1889లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. అప్పట్లో గునపాలతో బొగ్గును తొలిచి పైకి తీసుకొచ్చేవారు. బొగ్గు ఉత్పత్తిలో మహిళలు, బాలబాలికలు పాలుపంచుకునేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1947లో మహిళలను భూగర్భంలో పనిచేయకుండా నిషేధం విధిస్తూ అప్పటి భారత ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఆ తరువాత అవసరాలకు అనుగుణంగా మహిళలు సైతం గనుల్లో దిగి పనులు చేయవచ్చని గత చట్టాన్ని సవరించారు. దీంతో వారికి అవకాశాలు ఏర్పడ్డాయి.

నేరుగా ఉద్యోగావకాశం..

ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం ఈ ఏడాది మే నెలలో సింగరేణి నోటిఫికేషన్ ఇచ్చింది. పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్)గా 88 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 28 మంది మహిళలు ఉన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొత్తగూడెం ఏరియాలో ఆరుగు రు, భూపాలపల్లి ఏరియాలో ఆరు గురు, ఆర్‌జీ-2 ఏరియాలో ఆరుగురు, ఆర్‌జీ-1 ఏరియాలో ఐదుగురు, శ్రీరాంపూర్ ఏరియాలో ముగ్గురు, మణుగూరు ఏరియాలో ఇద్దరు సోమవారం జాయిన్ అయ్యారు.

ఏడాది శిక్షణలోనే...

ఉద్యోగంలో చేరిన వారికి రెండు వారాల పాటు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ఉంటుంది. మొదటి మూడు రోజులు రక్షణపై స్థానిక వృత్తి శిక్షణ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తారు. దీంతో కలుపుకొని రెండు వారాల పాటు వివిధ విభాగాలపై అవగాహన, మరో రెండు వారాలు పని ప్రదేశాల్లో శిక్షణ ఉంటుంది. నూతన ట్రైనీలు నెలకోమారు తమ శిక్షణకు సంబంధించిన రిపోర్టును వీటీసీలలో సమర్పించాలి. ఆరు నెలలకు ఫేజ్-1, ఒక సంవత్సరానికి ఫేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తదుపరి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తారు.

గతంలో కుటుంబ పెద్ద చనిపోతే..

సింగరేణిలో మహిళలకు గతంలో నేరుగా ఉద్యోగాలిచ్చే అవకాశం లేదు. కేవలం వారి కుటుంబ పెద్ద చనిపోతే ఉద్యోగం ఇచ్చేవారు. ఆ తరువాత 2018 నుంచి కారుణ్య విధానంలో నియామకాలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు కంపెనీ వ్యాప్తంగా సుమారు 1530 మందికి పైగా మహిళలు పనిచేస్తున్నారు. కాగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం పొందిన మహిళలు కార్యాలయాలు, విభాగాల్లో వివిధ పనులు చేస్తున్నారు. కానీ గనుల్లోకి దిగడం లేదు. గతేడాది జూన్ 24న అప్పటి వరకు ఉన్న సర్ఫేస్ పదం తొలగించి అండర్ గ్రౌండ్ అని సర్క్యులర్ జారీ చేయడంతో మహిళా ఉద్యోగులు అండర్‌గ్రౌండ్‌లోకి దిగక తప్పదా అని చర్చ జరిగింది. ఆ తరువాత ఆ విషయం మరుగున పడింది.

శిక్షణ పొందిన తరువాతే విధులు
కల్లూరి వెంకట రామారావు, మేనేజర్, శ్రీరాంపూర్ వీటీసీ




సింగరేణిలో ఎవరు నియామకమైనా ముందుగా వృత్తి శిక్షణ కేంద్రం (వీటీసీ) ద్వారా శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇక్కడ బొగ్గు గనులు, వృత్తి సంబంధిత పనులు, విధులు, నిబంధనలు, నియమాలు, రక్షణ, తదితర విషయాలపై థియరీ నేర్చుకుంటారు. అనంతరం వృత్తి సంబంధిత పనులను గనుల్లోకి వెళ్లి తెలుసుకుంటారు. నూతనంగా మైనింగ్ అధికారుల బ్యాచ్ రావడం అభినందనీయం.

కష్టాలు ఎదుర్కొని..



ఈమె పేరు మాడిశెట్టి సాయిప్రత్యూష. జగిత్యాల జిల్లా డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామం. తండ్రి టైలర్‌గా పనిచేసేవాడు. సాయిప్రత్యూషకు నాలుగేళ్ల వయస్సున్నపుడే తండ్రి చనిపోయాడు. తల్లి రేణుక టైలరింగ్ పనిచేస్తూ ఆమెతో పాటు చెల్లెలు ప్రియాంకను చదివించింది. నాచుపల్లిలో పాఠశాల విద్యాభ్యాసం, కరీంనగర్‌లో ఇంటర్మీడియెట్, కొత్తగూడెంలో బీటెక్(మైనింగ్) చేసింది. ఆ తరువాత రాజస్థాన్‌లో శిక్షణ పొందింది. ఇటీవల సింగరేణి ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఉద్యోగం సాధించింది.

మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం..



ఈమె పుట్టపాక సుమ. జగిత్యాలవాసి. తండ్రి తిరుపతి కారు డ్రైవర్. తల్లి భాగ్యలక్ష్మీ బీడీ కార్మికురాలు. సుమకు ఒక తమ్ముడు ఉన్నాడు. బీటెక్ చదువుతున్నాడు. జగిత్యాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, ఇంటర్ పూర్తి చేసింది. అనంతరం జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ చదివింది. చదువు పూర్తికాగానే పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) గా ఉద్యోగం సాధించింది.

ఉన్నత విద్యావంతురాలు



పాపునూక లక్ష్మి సైతం జగిత్యాలవాసే. తండ్రి బుచ్చన్న స్థానికంగా ప్రైవేటుగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. ఇంకా ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. లక్ష్మి ఎస్ఎస్‌సీ, ఇంటర్ జగిత్యాలలో చదువగా, మంథని జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ పూర్తి చేసింది. అనంతరం చెన్నై నుంచి ఎంబీఏ చదివింది. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)గా ఉద్యోగం పొందింది.

కొండగట్టులో భక్తుల సందడి


కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, డిశంబరు 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయయస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాడబూసి శ్రీధర్ కుటుంబ సమేతంగా అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం దసరా సినిమా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత మూర్తి కూడా అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చకులు సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్ర శేఖర్‌తో పాటు వెల్మ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, నూకపల్లి విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూధన్‌రావు, హరిచరణ్‌రావు, సంపత్‌కుమార్ ఉన్నారు

- సమాచారం పొందడం పౌరుల హక్కు

ప్రభుత్వ కార్యాలయాలు తదితర సంస్థల నుంచి సమాచారం పొందడం ప్రతీ ఒక్కరి హక్కు అని సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాడబూసి శ్రీధర్ తెలిపారు. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ ప్రజలు దేనినైనా తెలుసుకోవచ్చునని అందించడం సంస్థలు, కార్యాలయాల బాధ్యత అని తెలిపారు.


రూపు కోల్పోయిన పూలవనం


గదికి అడ్డంగా ఏర్పాటు చేసిన ఇసుక సంచులు

అశోక వనం

- కొండగట్టు అంజన్న పూలవనంపై శీతకన్ను
- ఎండిపోయిన మొక్కలు
- గుట్టల వరదనీటితో ఉనికి కోల్పోయిన పూలవనం

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలోని అశోక వనంపై అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉనికి కోల్పోతోంది. అందులోని పూలు, పండ్ల మొక్కలు, చెట్లు ఎండిపోయాయి. గతంలో నిత్యం ఇక్కడి నుంచే స్వామి పూజలకు ఆలయ అలంకారానికి పూలు, పండ్లు, మామిడి ఆకులు తీసుకు వచ్చేవారు.

కొండపై నుంచి జేఎన్‌టీయూ వెళ్లే మార్గంలో బొజ్జపోతన గుడి సమీపంలో గల స్వామి వారి రెండెకరాల భూమిలో నిత్య పూజలకోసం పదేళ్ల క్రితం అశోకవనం పేరిట పూలు, పండ్లతోటలను పెంచడం ప్రారంభించారు. ఇందులో దాదాపు 500వరకు మామిడి, దానిమ్మ, జామ, ఎలక్కాయ, ఉసిరితో పాటు గులాబి, తులసి తదితర అనేక మొక్కలను పెంచారు. వాటి పర్యవేక్షణకు దేవస్థానం సిబ్బంది ఒకరిని నియమించారు.

గత హరిత హారం కార్యక్రమంలో భాగంగా మరిన్ని మొక్కలు కూడా నాటారు. అయితే కొన్నాళ్లుగా దానిపై నిర్లక్ష్యం కొట్టొస్తోంది. పూలు,పండ్ల తోటలలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ వాటి సంరక్షణ, పెంపునకు దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా దాన్ని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దేవస్థానం పారి శుధ్య సిబ్బందిచే కొన్నాళ్ల క్రితం వరకు అశోక వనంలో కలుపు తీయడం, మొక్కల సంరక్షణ చేసేవారు.

చర్యలు తీసుకుంటాం..: రామకృష్ణరావు, ఈవో

అశోకవనం సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. మరిన్ని వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు కూడా నాటిస్తాం. మొక్కల పెంపుకు చేపడుతాం. పూలు ఆలయానికి వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటూ తరచూ పర్యవేక్షణకు అధికారులకు బాధ్యతలు అప్పగిస్తాం. పూలవనంను అద్భుతంగా తీర్చిదిద్దుతాం.

గుట్టల వరదతో కనుమరుగు

వర్షాకాలంలో కురిసిన వర్షాలకు గుట్టల నుంచి వచ్చిన వరదకు పూలవనం ఇసుక దిబ్బలతో నిండి రూపు కోల్పోయింది. సమీపం గుట్టల నుంచి వచ్చే నీరు వెళ్లడానికి గతంలో కాంటూరు కందకాలు, వాటి ముందు కాలువలు ఉండగా ఇటీవల కందకాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేశారు. దీంతో కాలువ కనుమరుగు అయిగుట్టల నీరంతా పల్లపు ప్రాంతంలో ఉన్న పూలవనంలోకి వరద వస్తోంది. దీంతో అక్కడ గల పూలవనం కొట్టుకుపోగా గదికి అడ్డంగా ఇసుక సంచులు వేశారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని తరచూ పర్యవేక్షిస్తూ అశోకవనం మరింత పెంపొందించాల్సిన అవసరం ఉంది.


డ్రిప్ పరికరాల వద్ద బయట నుంచి వస్తున్న నీరు

అంతరాష్ట్ర దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన కాలనీలో దొంగతనం కేసులో అంతరాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన అంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు(50)ని మంగళవారం బైపాస్ రోడ్‌లోని గౌతమినగర్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కరీంనగర్ ఒకటవ రాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. నవంబరు 23న శాతవాహన కాలనీలోని ఉప్పుగుండ్ల మురళీకృష్ణకు చెందిన ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టామన్నారు. మంగళవారం గౌతమినగర్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టగా సత్యనారాయణ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జడ్జి ఆదేశాలతో సత్యనారాయణను రిమాండ్‌కు తరలించాలని తెలిపారు. నిందితుడిపై గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు నమోదయ్యాయని, శిక్ష కూడా అనుభవించాడనిసీఐ తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉప సంచాలకులు ఎం.నాగిరేశ్వర్ తెలిపారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం ఎస్సీ రెన్యూవల్, ఫ్రెష్ విద్యార్థులు కళాశాలలు తమ దరఖాస్తులను ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ విద్యార్థులతో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా శ్రద్ధ వహించాలని కోరారు.

గీతాజయంతి ఉత్సవాలు ప్రారంభం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గీతా జయంతి ఉత్సవాలను ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా ప్రారంభించారు. మంగళవారం ఉదయం గీత జయంతి ఉత్సవాలను పురష్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి అద్దాల మండపంలో స్వస్తి పుణ్య హవచనం, మంటప ప్రవేశం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలను వేదమంత్రాలతో చేపట్టారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు గీతా హోమం ఘనంగా నిర్వహించారు. సంస్కృత పాఠశాల విద్యార్థులతో భగవద్గీత పఠనం చేయించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయ అద్దాల మండపంలో శ్రీమద్భాగవతము దశమస్కంద పురాణ ప్రవచనము చేశారు.

రాజన్నను దర్శించుకున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ఆలయంలో స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయి

జాతీయ సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్


మాట్లాడుతున్న మాఢబూసి శ్రీధర్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) మనిషి పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయని అవి ఎవరో ఇచ్చేవి కావని జాతీయ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జతీయ మానవ హక్కుల సమాఖ్య జగిత్యాల ఆధ్వర్యంలో జగిత్యాలలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాడభూషి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగే హక్కు, ఆలోచించే హక్కు జీవించే హక్కు ఇవన్నీ ఎవరి ద్వారానో రాలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగం ద్వారా మనకు మరిన్ని హక్కులు సంక్రమించాయన్నారు.కార్యక్రమంలో తెలంగాణ మానవ హక్కుల సమాఖ్య ఫౌండర్, చైర్మన్ అయిల్నేని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నక్క గంగారాం, ఉపాధ్యక్షులు సందీప్‌రావు, ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రతినిధి ప్రశాంత్‌రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్ప చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై రెండు రోజులుగా గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తున్నారు. ప్రతి నిత్యం ఇసుకను అక్రమంగా తరలించడమే కాకుండా ఓవర్ లోడ్‌తో


ఊటూర్-పచ్చునూర్ గ్రామాల మధ్య నిలిచిన ఇసుక లారీలు

వెళ్లడంతో రోడ్లు అవుతున్నాయని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రెండు రోజులుగా పచ్చునూర్, ఊటూర్ గ్రామస్థులు, మండల కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టి లారీలను అడ్డుకున్నారు. ఊటూర్ క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఓవర్ లోడ్‌తో ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఇసకలారీలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మానకొండూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మర్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండెల మహేందర్, మండల యూత్ అధ్యక్షులు కోండ్ర సురేష్, ఎర్రోల్ల కవిత, కనకం అశోక్, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

భగత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్ బాల్ ఎంపిక పోటీలు మంగళవారం ముగిసాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. బాలుర విభాగంలో కరీంనగర్ 1వ స్థానం, మహబూబ్ నగర్ 2వ స్థానం, ఖమ్మం 3వ స్థానం, బాలి కల విభాగంలో ఖమ్మం 1వ స్థానం, కరీంనగర్ 2వ స్థానం, హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచాయి.


గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

న్యాక్ బృందం గిరిజన మహిళా డిగ్రీ కళాశాల సందర్శన


న్యాక్ బృందంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం మంగళవారం సందర్శించింది. బృందం సభ్యులు రెండు రోజుల పాటు కళాశాలలోని వివిధ విషయాలపై అధ్యయనం చేసినట్లు ప్రిన్సిపల్ రెహానా ఇఫత్ తెలిపారు. కళాశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన పద్ధతులు, అవలంభిస్తున్న విధానాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయని అధ్యయనం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాల ఆధారంగా గ్రేడ్ కేటాయించేందుకు నివేదికను షీల్డ్ కవర్‌లో బెంగళూరులోని నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయానికి పంపించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐక్య, కోఆర్డినేటర్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అబద్ధపు హామీలతో విసిగిపోయిన ప్రజలు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్


బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు హామీలతో ప్రజలు విసిగిపోయారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలు, 66 మోసాలు పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండా చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రదీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిగా నిర్వహిస్తున్న పాలనను ప్రజల ముందు ఎండగట్టేందుకు బీజేపీ ఉద్యమి స్తోందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని అని స్పష్టం చేశారు. సమావేశంలో గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, శిలారపు పర్వతాలు, కాసిపేట శివాజీ, లావణ్య, ఊశ్లే తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, తంగేడ రాజేశ్వర్‌రావు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమలో నాయకులు కూకట్ల నాగరాజు, గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, సోమారపు లావణ్య, సంధ్యారాణి, ఎస్ఎస్‌సీ వనజ, అశోక్‌రావు, రాజన్నపటేల్, కందునూరి కుమార్, పవన్, కుమార్‌రెడ్డి, వేగోళం శ్రీనివాస్, సదయ్య పాల్గొన్నారు.

రామగుండంలో మొదలైన 'ఇందిరమ్మ' సర్వే

- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికకు పకడ్బందీ వెరిఫికేషన్
- జీపీఎస్ ఫొటోలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పరిశీలన


ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక వెరిఫికేషన్ నిర్వహిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌ను ఈ సర్వేలో ఉపయోగిస్తున్నారు. పేదల్లో నిరుపేదలకు మొదటి దశలో ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే ఇందిరమ్మ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసి ఉంచారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి సర్వే చేస్తున్నారు. ఇందిరమ్మ యాప్‌లో వివరాల ఆధారంగా వెరిఫికేషన్ చేస్తున్నారు. యాప్‌లో పలు అంశాలను కీలకంగా పెట్టారు. ముఖ్యంగా గతంలో ఇందిరమ్మ లబ్ధిదారులు, రేషన్‌కార్డులు, దరఖాస్తుదారులకు స్థలం ఉందా అనే విషయాలను ఆరా తీస్తున్నారు.

ఫొటోలు అప్‌లోడ్..

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి వెరిఫికేషన్‌లో ఈ సారి టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా యాప్‌లో ప్రస్తుతం నివాసముంటున్న ఇల్లు సొంతమ, అద్దెనా, ఏ రకమైన కట్టడం అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

ఇంటిబయట, పైకప్పు, లోపల జీపీఎస్‌తో అనుసంధానం చేసి ఫొటోలు తీస్తున్నారు. ఇల్లు రేకుల ఇల్లా, స్లాబా అనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఇంటి స్థలం ఉంటే డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తున్నారు. డాక్యుమెంట్లకు సంబంధించే 12రకాల ఆప్షన్లు ఇచ్చారు. సొంత స్థలం, ప్రభుత్వ స్థలం, ప్రభుత్వం నుంచి పట్టా తీసు కున్న స్థలం,రెగ్యులరైజ్ అయిన స్థలం, అసైన్డ్, గ్రామ కంఠం తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. స్థలానికి సంబంధించి సేల్‌డీడ్‌లు, ఇతర వివరాలు తీసుకుంటున్నారు. ఒకవేళ నివాసముంటున్న ప్రాంతానికి స్థలం దగ్గరలోనే ఉంటే ఆ స్థలం వద్ద దర ఖాస్తుదారుల ఫొటోతో పాటు రేఖాంశాల వివరాలను పొందుపరుస్తున్నారు.

పాత లబ్దిదారులకు నో ఛాన్స్..

ఇందిరమ్మ పథకంలో గతంలో లబ్ధిదారులుగా ఉన్న వారికి అవకాశం ఇవ్వరు. దీంతో పాటు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు, పక్కా ఇండ్లు, ఖరీదైన స్థలాలు ఉన్న వారు, ఫోర్‌వీలర్స్ యజమానులకు అవకాశం ఉండదు. ఈ పథకం క్రింద అర్హులను గుర్తించి ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్య తనిస్తారు.

మూడు విడతల్లో నిధులు..

ఇందిరమ్మ పథకానికి అర్హులైన పేదలకు మొదటి దశలో నియోజకవర్గానికి 3500 మంజూరు చేస్తారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి మూడు విడుతల్లో రూ.5లక్షల చొప్పున నిధులు ఇస్తారు. నిర్మాణానికి సంబంధించి జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌తో ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుంది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ పథకం అర్హుల ఎంపికకు సర్వే మొదలైంది. నగర పాలక సంస్థ పరిధిలో 50డివిజన్లు ఉండగా ఆయా డివిజన్ల బిల్ కలెక్టర్లు, సహాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాల ఆధారంగా ఈ సర్వే చేస్తున్నారు. రామగుండం అర్బన్‌లో మొదటి రోజు జరిగిన సర్వేలో ఎక్కువ వరకు సింగరేణి కార్మిక కుటుంబాలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు ఉన్నట్టు తెలుస్తుంది. కాగా 20ఏళ్ల క్రితం సింగరేణిలో గోల్డెన్ షేక్ హ్యాండ్, వీఆర్ఎస్‌లతో పదవీ విరమణ చేసిన వేలాది మంది కార్మిక కుటుంబాలు గూడు లేక ఇప్పటికీ అద్దె ఇండ్లలోనే ఉంటున్నారు.

జిల్లా ఆస్పత్రికి పరికరాల అందజేత

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ వైద్య పరికరాలను అందచేశారు. మంగళవారం దారం సుశీల ట్రస్ట్ తరఫున ఆసుపత్రికి బీపీ ఆపరేటర్, 200గ్లూకోజ్ స్ట్రిప్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సృజన్, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీన, డాక్టర్ సజిత, పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతోష్‌నగర్‌లో మంగళవారం సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె సాగర్‌రావు, కమిటీ ప్రతినిధులు పరమేశ్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెస్ విజేతలకు సీపీ అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చదరంగ క్రీడలో పతకాలు సాధించిన జిల్లా చదరంగ క్రీడాకారులను పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి అభినందించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నర్మదాపురంలో జరిగిన జాతీయస్థాయి పాఠశాలల అండర్-17 చెస్ పోటీల్లో సుప్రీత్ రజత పతకం సాధించింది. సింగపూర్‌లో జరిగిన జాతీయస్థాయి అండర్-16 స్కూల్ గేమ్స్‌లో మేఘసంహిత కాంస్య పతకం సాధించింది. ఈసందర్భంగా క్రీడాకారులను, జీనియస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, కోచ్‌అనూప్ కుమార్‌ను సీపీ అభినందించారు.

నేడు గీతాజయంతి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం గీతాజయంతిని జరుపుకోనున్నారు. నగరంలోని అన్ని ఆలయాల్లో భగవద్గీత పారాయణాలు, గోపూజలు, గీతా గ్రంథాల వితరణ జరుగనున్నాయి.

బీమా చెక్కు అందజేత

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10: నగరంలోని గాయత్రీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారుడు రవి ప్రమాదవశాత్తు మరణించగా సేవింగ్ ఖాతాపై గల ప్రమాద బీమా సౌకర్యం ద్వారా అతడి కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ గొట్టె అశోక్, సీనియర్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపాన్ని మార్చాడాన్ని నిరసిస్తూ తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మంగళవారం నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ముందు జంక్షన్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ గతంలో ఈ జంక్షన్‌లో తెలంగాణ తల్లి విగ్రహం, మాజీ ఎంపీ స్వర్గీయ జువ్వాడి చొక్కారావు విగ్రహం ఉండేదన్నారు. జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణలో భాగంగా ఇక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని తొలగించి, రెండు విగ్రహాల కోసం రెండు వేర్వేరుగా జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలోనే జంక్షన్ సుందరీకరణ పనులు పూర్తిచేసి తిరిగి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పార్టీ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తపల్లి మండలం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: ఎస్‌యూ ఎదుట శాతవాహన జేఏసీ చైర్మన్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు చైతన్య తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చెందబోయిన సాయి రెడ్డి, నైతం మహేష్, నైతం సాయి కృష్ణ, శివ పవన్,ఉమర్, అనూప్ రెడ్డి,రాకేష్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

●గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●రామడుగు: మండలంలోని తిరుమలపూర్ గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.

●సైదాపూర్: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

●హుజూరాబాద్‌రూరల్:పెద్దపాపయ్యపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, యూత్ అధ్యక్షుడు కత్తుల రాజు పాల్గొన్నారు.

●మానకొండూర్: మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: మండలంలోరి మన్నెంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రావుల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సమావేశం

కరీంనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి ఈనెల 7న ఓటరు జాబితా ప్రదర్శించామన్నారు. 15 మండలాల పరిధిలో మొత్తం ఓటర్లు 5,35,246 ఉండగా, పురుషులు 2,60,889 మంది కాగా, మహిళలు 2,74,346 ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 323 గ్రామ పంచాయతీలు ఉండగా 320 గ్రామాల్లో 3 వేల వార్డులు ఉన్నాయన్నారు. వార్డుకో పోలింగ్ స్టేషన్ చొప్పున 3026 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం 650 మంది ఓటర్లు దాటిన వార్డులో అదనంగా మరో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చింతకుంట, బొమ్మకల్ గ్రామాల్లోని వార్డుల్లో అదనంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం డీపీవో రవీందర్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో బి వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతిని ధులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, కల్లెపెల్లి రాజేందర్, మహ్మద్ అఖిల్ ఫిరోజ్, కళ్యాడపు ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ప్రతి మనిషికి రాజ్యాంగం హక్కులను ప్రసాదించిందని, వాటిపై అవగాహన పెంచుకోవలసిన బాధ్యత ఉందని తెలిపారు. కష్టపడి చదువుకొని వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి పాల్గొన్నారు.

మానవహక్కుల దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానవక్తగా హాజరైన కళాశాల చరిత్ర అధ్యాపకులు కే సుధాకర్ మాట్లాడుతూ హక్కులు లేని మనిషి బానిసతో సమానమన్నారు. జాతీయత, జాతి, రంగు, మతం, భాష, మరే ఇతర హోదాతో సంబంధం లేకుండా మానవ హక్కులు మనందరికీ అంతర్లీనంగా ఉంటాయన్నారు. మానవుల మాన ప్రాణాలకు భరోసా కల్పించేవే మానవహక్కులు అని, ఇవి పుట్టుకతో ప్రతి వ్యక్తికి అబ్బిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ టి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ కె అర్జున్, డాక్టర్ వి రాజేశం, ఎలిజబెత్ రాణి, డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ రాపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గ్రంథాలయాల బలోపేతానికి కృషి'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా గెలిపిస్తే గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు బాసటగా నిలిచేందుకు తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన రెండు నెలల పర్యటనలో గ్రంథాలయాలకు వెళ్లగా చాలాచోట్ల మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తన సొంత నిధులతో చాలాచోట్ల భోజన ఏర్పాట్లతోపాటు కుర్చీలు, ప్యాడ్లు, వాటర్ కూలర్స్, సింటెక్ ట్యాంకులు, అదనపు తరగతి గదులకు రేకులు వేయించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర మధుసూదన్ రెడ్డి, చందు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

'ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కరువు'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైందని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని రవీందర్‌సింగ్ ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 ప్రభుత్వశాఖలో రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సర్వశిక్ష ఉద్యోగులను సచివాలయానికి పిలిపించి టీ తాగే లోపు మీ సమస్యలను పరిష్కరిస్తానంటూ చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

ఏడాదికి లక్ష ఉద్యోగాలిస్తామని నిరుద్యోగ యువతను మోసం చేశారని ఆరోపించారు. ఏడాది పాలనలో తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ప్రజలు, తెలంగాణవాదులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను చూసి ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారెంటీలు అటకెక్కాయని, ఏడాది కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఐదు డీఏలు బకాయి ఉంటే ఒక డిఏ ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈవిలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

భగత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కోతిరాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలనుసందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మధ్యాహ్న భోజనం చేయడానికి వంట గదులు లేవని, పాఠశాల ఆవరణలో పరిశుభ్రం ఉండడం లేదన్నారు. మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని మధ్యాహ్న భోజనం మెను ప్రకారం అమలు చేయాలని ప్రభుత్వపాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని, నాసిరకమైన ఆహార వస్తువులు సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు సాయికుమార్, శ్రీకాంత్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చవద్దు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి కొయ్యలు కాల్చితే వాతావరణ కాలుష్యం పెరుగుతుందని ఏడీఏ రణధీర్ రైతులకు సూచించారు. మంగళవారం కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్ గ్రామంలో వరి కొయ్యల కాల్చడం వల్ల వచ్చే అనార్థలను రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బీసత్యం, ఎఈవోలు స్వర్ణలత, సైదితల్లి, సుచరిత, ఉదయ్, హార్టికల్చర్ ఆఫీసర్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుడి మృతికి కొవ్వొత్తులతో నివాళి


గుగులోత్ కృష్ణకు నివాళులర్పిస్తున్న ఆర్టిజన్ కార్మికులు

గణేశ్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నర్సంపేటకు చెందిన ఆర్టిజన్ కార్మికుడు గుగులోత్ కృష్ణ విద్యుదాఘాతంతో మృతిచెందగా కరీంనగర్ ట్రాన్స్‌కో ఆఫీస్ ఎదుట కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆర్టిజన్ కార్మికులు మాట్లాడుతూ నర్సంపేట సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ కార్మికుడు గుగులోత్ కృష్ణ విద్యుదాఘాతానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. నివాళులర్పించిన వారిలో శ్రీనివాస్, రగునాథ్‌రెడ్డి, అమానుల్లా, శివకృష్ణ, శ్రీనివాస్, శ్రీకాంత్ ఆర్టిజన్ కార్మికులు ఉన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో ఈ నెల 25, 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ జెన్‌నెక్స్ పాఠశాల విద్యార్థులు వర్షిత్ కుమార్, బి శ్రీవిద్యలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి రాష్ట్ర క్రీడా పతాకాన్ని రెపరెపలాడించాలని ఆకాంక్షించారు.

'మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

సుభాష్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుబారా ఖర్చులు చేస్తున్నాడని వారు విమర్శించారు. మంగళవారం మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం, రాజన్న సిరిసిల్ల జిల్లా సలహాదారులు బొజ్జ మల్లేశం, మల్యాల దేవయ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానేరుడ్యాం కట్టపై చెట్ల పొదలను తొలగించి విద్యుత్ దీపాలను పునరుద్ధరించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని మానేరు వాకర్స్, లేక్ వాకర్స్, శ్రీవెంకటేశ్వర కాలనీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సాగర్ రెడ్డి, ఆకుల నర్సయ్య ఉన్నారు.

తెలంగాణ తల్లి ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు న్యాయం

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ప్రజామిత్ర ప్రోగ్రెసీవ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా దోపిడి రాజ్యం నడిచిందన్నారు.

రేపు గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 12వ తేదీన గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష జరగనున్నట్లు మండల పరిషత్తు అభివృద్ధి అధికారి తూర్పాటి సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఓటరు జాబితాపై ఉదయం 11 గంటలకు సమీక్ష ఉంటుందని తెలిపారు.

కొత్త గ్రామపంచాయతీల్లో ప్రజాభిప్రాయ సేకరణ

శంకరపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామపంచాయతీ నుంచి కొత్తగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలు గుడాటిపల్లి, నల్ల వెంకయ్యపల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం ఆధ్వర్యంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్ సమక్షంలో గ్రామసభలు నిర్వహించారు. గుడాటిపల్లిలో జరిగిన గ్రామసభలో మెజార్టీ ప్రజలు మొలంగూర్ గ్రామపంచాయతీలోనే ఉంటామని, గుడాటిపల్లి కొత్త గ్రామపంచాయతీ వద్దని అధిక శాతం ప్రజలు వారి అభిప్రాయాలు తెలిపారు. కాగా నల్లవెంకయ్యపల్లి గ్రామసభలో మెజార్టీ ప్రజలు కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటుకు అనకూలంగా వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి


మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్/తిమ్మాపూర్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. గతంలో మంజూరైన పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించి నూతన పనులకు నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. స్పందించిన మంత్రి వెంకట్‌రెడ్డి పెండింగ్ పనులు పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడుతానని, మొదటి దశలో రూ. 100 కోట్ల నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే

రామడుగు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం 20 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను, అలాగే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను ఎంఈవో వేణుకుమార్, ఎంపీడీవో రాజేశ్వరిలతో కలిసి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీస్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ ఉన్నారు.

విద్య, క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- సీఎం కప్ క్రీడా పోటీలు

గంగాధర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధరలో మండల స్థాయి సీఎం కప్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల నుంచి ఒలింపిక్ స్థాయికి ఎదిగేలా చేయడమే సీఎం కప్ ఉద్దేశమన్నారు. మంగళవారం బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ ఆటల పోటీలను మండల ప్రత్యేకాధికారి తిరుపతిరావు ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మహేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇప్పనపల్లి సాంబయ్య, కౌన్సిలర్లు గంగయ్య, కె అశోక్, మండల అభివృద్ధి అధికారి వేణుగోపాల్‌రావు, ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్, ఎస్ఐ అనూష, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను మండల ప్రత్యేకాధికారి నాగార్జున ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, ఎంఈవో లక్ష్మీనారాయణ, పీఈటీలు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని వెన్కేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీల్లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ మంజుల, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ తిరుపతి, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను మండల విద్యాశాఖ అధికారి కె రామయ్య ప్రారంభించారు. తహసీల్దారు ఇప్ప నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీకార్యదర్శి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్‌లోని జిల్లా పరిషత్ స్కూల్‌లో మంగళ వారం సీఎం కప్ పోటీలను ఎంపీడీవో సంజీవరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీందర్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రె స్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ సంపత్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ రమేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే అద్భుత భవిష్యత్

వీణవంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ కె రాజిరెడ్డి అధ్యక్షతన పేరెంట్స్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగేలా అధ్యాపకులు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేలా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. చెడు వ్యసనాలకు లోనై జీవితాలను నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ రామ్మోహన్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

'విశ్వప్రగతి'లో తరగతులు నిర్వహించవద్దు

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని విశ్వప్రగతి విద్యాలయంలో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం బుధవారం నుంచి ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని ఎంఈవో శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో చదివే విద్యార్థులను ఇతర పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పించుకోవాలని కోరారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ పాఠశాలలో ఎలాంటి తరగతులు నిర్వహించకుండా ఖాళీ చేయిస్తున్నామని ఆయన తెలిపారు.

గణిత ప్రతిభా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్/చొప్పదండి/శంకరపట్నం/రామడుగు/వీణవంక/కరీంనగర్‌రూరల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణితం ప్రతిభ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలకు ఎంఈవో భూపతి శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జీ హెచ్ఎం మమత, గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. చొప్పదండి మండల కేంద్రంలో పాఠశాలకు ముగ్గురు చొప్పున మొత్తం 207 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి పాల్గొన్నారు. శంకరపట్నం మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో లక్ష్మీనారాయణ, పాఠశాల హెచ్ఎం సుభాష్ ప్రశంసపత్రాలు అందజేశారు. వీణవంక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత ప్రతిభ పోటీల్లో చల్లూరు పాఠశాల విద్యార్థులు, ఘన్ముక్ల విద్యార్థులు, కేజీబీవీ పాఠశాల విద్యార్థి సంజన అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. విద్యార్థులకు ఎంఈవో శోభారాణి బహుమతులను ప్రదానం చేశారు. హెచ్ఎం అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు. రామడుగు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన గణితం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె. రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. కరీంనగర్ రూరల్ మండల స్థాయి గణిత ప్రతిభాపాటవ పోటీలను నగునూర్ గ్రామంలోని మండల పరిషత్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు తెలుగు, ఆంగ్ల మాధ్యమముల నుంచి 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో రవీందర్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కరీంనగర్ అర్బన్‌లో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌లో తీగలగుట్టపల్లి విద్యార్థులు ప్రతిభ చాటారు. నగరంలోని దన్‌గర్‌వాడి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టులో తీగలగుట్టపల్లికి చెందిన ఎ కృతిక ప్రథమ స్థానంలో నిలవగా, పి మహిమాన్విత ద్వితీయ స్థానంలో నిలిచింది. హెచ్ఎం కరుణ, గణిత ఉపాధ్యాయురాలు టి శ్రీలత అభినందించారు.


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంఈవో రవీందర్

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టు

సైదాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆశా కార్యకర్తలను మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న 31 మంది ఆశాకార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

● జమ్మికుంట: అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన 11మంది ఆశా కార్యకర్తలను జమ్మికుంట గాంధీ చౌరస్తాలో మంగళవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 140మంది విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్ మంగళవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు పల్కల ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా నిర్వాహకుడు జగదీశ్వర్ పిల్లలకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుమల, రత్నం, ఉపాధ్యాయులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామడుగు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎక్సైజ్ సిబ్బంది అనిల్, స్వప్నలు ఉన్నారు.

రైతులు ఆగం కావద్దు

రామడుగు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :పత్తిని తక్కువ ధరకు విక్రయించుకొని రైతులు ఆగం కావద్దని గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి అన్నారు. మండలంలోని వెలిచాల గ్రామంలోని కావేరి జిన్నింగ్ మిల్లు, సీసీఐ కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలోని మ్యాచర్ మిషన్‌ను, కావేరి జిన్నింగ్ మిల్లులోని మ్యాచర్ మిషన్‌ను పరీక్షించారు. పత్తిని రైతులు ప్రభుత్వం కేటాయించిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో విక్రయించి అధిక ధరను పొందాలన్నారు.